క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: ప్లాస్టిక్ వాడటాన్ని ప్రజలు నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. పట్టణంలోని పలు కాలనీల్లో స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా శుక్రవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మార్కెట్‌కి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా బట్ట సంచులు తీసుకొని వెళ్లాలని కోరారు. కాలనీలోకి వచ్చే స్వచ్ఛ ఆటోకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడంతో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రజలందరూ అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ తిరుపతి, ప్రత్యేక అధికారి రమేశ్, నాయకులు బిరుదు రాధాకృష్ణ ఉన్నారు.

ఆలయ పునరుద్ధరణకు విరాళం



నగదు అందజేస్తున్న రామకృష్ణ

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి టెంపుల్ పునరుద్ధరణ కోసం వ్యాపారి పూసాల రామకృష్ణ శుక్రవారం రూ.10వేలు విరాళంగా అందజేశారు. రంగారెడ్డి, ప్రేమ్ చందర్‌రావు, పురం రమణ, అంజయ్య ఉన్నారు.

భూమిపూజ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో మున్నూరుకాపు సంఘం నిత్యాన్నసత్ర భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం పెద్దపల్లిలో సంఘం జిల్లా అధ్యక్షుడు అమిరిశెట్టి రామస్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వునుకొండ శ్రీధర్, ఆకుల స్వామి వివేక్‌పటేల్ ఆవిష్కరించారు. కాశీ పీఠాధిపతి చేతుల మీదుగా 31న జరిగే కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు మహేందర్, చంద్రహాస్ ఉన్నారు.

బీఎస్పీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటేశ్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన హమాలీ సంఘం కార్మికులు శుక్రవారం బీఎస్పీ పార్టీలో దాదాపు 50మంది చేరగా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, చంద్రశేఖర్, రామన్న, రమేశ్ ఉన్నారు.

డ్రైనేజీల్లో చెత్తచెదారం తొలగింపు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని 8వ వార్డులో చేపట్టిన స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా డ్రైనేజీల్లో చెత్త చెదారం తొలగించారు. రోడ్లపక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఇంటి వాతావరణంతో పాటు వీధులు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. వార్డు ఇన్‌చార్జి గద్దల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, జయరాజ్, సతీశ్, ప్రేమ్, మరియ పాల్గొన్నారు.

జమాతే ఇస్లామీ అధ్యక్షుడిగా జావీద్

పెద్దపల్లిరూరల్: జమాతే ఇస్లామీ పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ జావీద్ వరుసగా రెండోసారి ఎన్నికైనట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు సాదత్ ఉల్లా హుస్సేని తెలిపారు. ఈ పదవిలో జావీద్ రెండేళ్ల పాటు కొనసాగుతారని పేర్కొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు..
- ఖాళీలను భర్తీ చేసేదెన్నడు?
- కరెంటు, తాగునీటికి ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న జూలపల్లి అంగన్‌వాడీ కేంద్రం

జూలపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు లేక సిబ్బంది, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో సొంత భవనాలు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని 14 గ్రామాల్లో 29 కేంద్రాలు ఉండగా పది కేంద్రాలు అద్దె ఇళ్లలోనే కేంద్రాలను నడిపిస్తుండగా మరో ఆరు కేంద్రాలను స్థానిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇల్లు కిరాయి ఇచ్చేందుకు యజమానులు ముందుకు రావడం లేదని ఆయా కేంద్రాల టీచర్లు వాపోతున్నారు. ప్రభుత్వం తక్కువ అద్దె చెల్లించడమే ఇందుకు కారణమని వారు చెప్తున్నారు. జూలపల్లిలో ఐదు కేంద్రాలకు గాను రెండింటికి సొంత భవనాలు ఉండగా అవి కూడా శిథిలావస్థకు చేరాయి.

ఖాళీలు భర్తీ చేసేదెన్నడు?

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 3 టీచర్ పోస్టులు, 5 ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆయాలే నిర్వహిస్తున్నారు. అబ్బాపూర్‌లో నిర్వహిస్తున్న రెండు కేంద్రాలను ఒక్కరే నిర్వహించాల్సి వస్తోంది. ఇరవై ఏళ్లుగా ఖాళీగానే ఉన్నా, కోర్టు కేసు పేరుతో భర్తీ చేయడం లేదు. జూలపల్లిలో పంచాయతీ నిధులతో సొంత భవనం నిర్మించేందుకు స్థానిక బాలికల వసతి గృహం ఎదుట స్థలం ఇవ్వగా స్లాబువేసి వది లిపెట్టారు. పదేళ్లయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

జిల్లా వివరాలు..

జిల్లాలో సొంత భవనాలు ఉన్నవి 232 కాగా, అద్దె ఇళ్లలో 313, ప్రాథమిక పాఠశాల ప్రాంగణాల్లో 161 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అధికారులు లెక్కల ప్రకారం పెద్దపల్లి సీడీపీవో పరిధిలో 300 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 5 మినీ కేంద్రాలు ఉండగా ఇందులో 2139 గర్భిణులు, 2156 బాలింతలకు సేవలు అందుతుండగా, అనుబంధ పోషక లబ్ధిదారులు 7 నెలల నుంచి ఏడాది వయసు పిల్లు 1762 మంది, ఏడాది నుంచి మూడేళ్ల వారు 6901, మూడు నుంచి ఆరేళ్ల వయసు వారు 4513 మంది ఉన్నారు. మొత్తం 17,471 లబ్ధిదారులకు పోషకాహారం అందుతోంది.

ఇబ్బందులు పడుతున్నం



అద్దె భవనాలతో ఇబ్బందులు పడుతున్నం. కేంద్రాల నిర్వహణకు ఇళ్లను అద్దెకు ఇవ్వడం లేదు. కిరాయి పెంచాలని అంటున్నారు. ప్రభుత్వం రూ.వెయ్యి అద్దె ఇచ్చినా, ఇంకా ఎక్కువ కావాలని అడుగుతున్నారు. తాగునీరు, కరెంటు లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఎండలకు పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు.

– గద్దం శైలజ, అంగన్‌వాడీ టీచర్, జూలపల్లి

జెడ్పీ నిధులతో సౌకర్యాలు



జెడ్పీ నిధులతో మండలంలోని 12 భవనాలకు సౌకర్యాలు కల్పించేందుకు ఒక్కో దానికి రూ.1.50లక్షల నిధులు మంజూరు చేసినం. ఇందులో కరెంటు, ఫ్యాన్, మంచినీరు సౌకర్యం కల్పించేందుకు నిధులు కేటాయించినం. పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం. మిగతా కేంద్రాలకు కూడా నిధులు కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

– బొద్దుల లక్ష్మన్, జెడ్పీటీసీ

ఖాళీల భర్తీకి చర్యలు తీసుకున్నాం

ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలోనే నోటిఫికేషన్ వస్తుంది. నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వానికి నివేదికలు పంపించినం. త్వరలోనే అవి కూడా మంజూరయ్యే అవకాశం ఉంది. అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి.

– కవిత, సీడీపీవో, పెద్దపల్లి

హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: జిల్లా ఆసుపత్రిలో హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. హజ్ యాత్రకు బయల్దేరే వారంతా వ్యాక్సినేషన్ కోసం హైదరాబాద్ వెళ్లకుండా స్థానికంగానే ఈ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ శిబిరంలో 47మందికి వ్యాక్సిన్ వేసినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శౌరయ్య, ఇమ్యునైజేషన్ అధికారి కృపాబాయి, ఫిజీషియన్ విరూపక్షం, నోడల్ అధికారి మహేందర్, రవీందర్, రాజేశం, జమున ఉన్నారు.

అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని, రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు కౌశికహరి ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాలకుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కౌశికహరి మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో విఫలమైందని, రైతులు నెలల తరబడి కేంద్రాల్లో పడిగాపులు కాస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్వరితగతిన కొనుగోళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, మిల్లర్లు కటింగ్ పేరుతో దోచుకున్న వాటిని తిరిగి రైతులకు చెల్లించాలని కోరారు. వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ 30న బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని బీజేపీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతిపత్రం అందించారు. రామగుండం 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక లత, నాయకులు మహావాది రామన్న, బాలసాని మల్లేషం, తోడేటి రవికుమార్, బత్తిని సతీశ్, కమలాకర్‌రెడ్డి, తోట మల్లయ్య, పెద్దపల్లి పవన్, నాగరాజు, రాజు, నేరేళ్ల సాగర్, శ్రీనివాస్, సత్యం, ఎరుకల శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్సకు డబ్బులు లేకపోవడంతో అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణను ఆశ్రయించారు. ఈ విషయమై జెడ్పీటీసీ ప్రత్యేక చొరవ తీసుకొని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స చేయించుకునేందుకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ నిధి రూ.8లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఎమ్మెల్యేకు, జెడ్పీటీసీకి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం అందజేత



పెళ్లి సామగ్రి అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: తండ్రి లేని నిరుపేద యువతి కోమల వివాహానికి ఆర్జీ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ దంపతులు 50 కేజీల బియ్యం, పట్టుచీర పెళ్లి సామగ్రి, స్టీల్ సామగ్రి రూ.19,900 విలువగల వస్తువులను అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. రామగుండం ఏరియాలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం యువతి వివాహానికి తమవంతుగా సాయం అందించారు. అనంతరం జీఎం దంపతులను సత్యసాయి సేవా సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, అధికారులు రామ్మూర్తి, ప్రభాకర్, శంకరయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకల సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న చింతల లక్ష్మి

గోదావరిఖని: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల సన్నాహక సమావేశం శుక్రవారం రామగుండం ఏరియా–1 సింగరేణి సేవా భవన్‌లో నిర్వహించారు. సమావేశంలో సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఈనెల 29న ఇల్లందు క్లబ్‌లో ఆటలపోటీలు, జూన్ 2న ముగ్గుల పోటీలు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించి ప్రధాన వేడుకలను జూన్ 5న నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీనాసింగ్, లక్ష్మీనారాయణ, బంగారు సారంగపాణి, మేడి తిరుపతి, రవికుమార్ లేడీస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ఆదరించాలి

యైటింక్లయిన్‌కాలనీ: నేత్ర శరీర అవయవదానంపై అవగాహన కల్పిస్తూ సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ఆదరించాలని సదాశయ ఫౌండేషన్‌తో పాటు తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం ప్రతినిధులు మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సంఘం ప్రతినిధులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, కొమురయ్య, రాజమల్లయ్య, శ్రీనివాస్ కలిసి నేత్రదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేత్ర శరీర అవయవదానం ప్రాముఖ్యత అనే అంశాన్ని జోడించి వివరించాలన్నారు. మంత్రి సానుకులంగా స్పందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో కోతలపై ఆగ్రహం

- మండల సభలో ఐకేపీ ఏపీఎంను నిలదీసిన సభ్యులు



ఐకేపీ ఏపీఎంను నిలదీస్తున్న తారుపల్లి సర్పంచ్ బైరం రమేశ్

కాల్వశ్రీరాంపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతలపై మండల సభ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలుగ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు వరిధాన్యం తూకంలో అక్రమాలపై ఐకేపీ ఏపీఎం కనుకయ్యను నిలదీశారు. రైతులు పండించిన వరిధాన్యం బస్తాకు 40.700 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా 43 కిలోలు తూకం వేస్తున్నారని, క్వింటాల్‌కు 6కిలోల వరకు నష్టం వస్తోందన్నారు. కిష్టంపేటలో 15రోజులైనా కాంటాలు పెట్టడం లేదని, నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని సర్పంచ్ కాసర్ల తిరుపతిరెడ్డి ఆరోపించారు. రైతులకు తక్‌షీట్లు ఇవ్వటం లేదని తెలిపారు. ప్రయివేటు పాఠశాల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా నాలుగేళ్ల పిల్లలను బడిలో అడ్మిషన్ చేసుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నవారు ప్రయివేటు స్కూళ్లలో అడ్మిషన్ పొందడంపై పలువురు సర్పంచులు ఆక్షేపించారు. పదో తరగతి ఫలితాల్లో 8 జెడ్పీ హైస్కూళ్లలో 100శాతం ఉత్తీర్ణత సాధించగా పబ్లిక్ పరీక్షలు రాసిన వారిలో 97.51శాతం మంది ఉత్తీర్ణత పొందారని ఎంఈవో రాజయ్య పేర్కొన్నారు. పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, కరెంటు స్తంభాలు వంగి ఉన్నాయని, ప్రమాదం సంభవించక ముందే వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందు సరి చేయాలని సభ్యులు ట్రాన్స్‌కో ఏఈని కోరారు. శ్మశాన వాటికల్లో వేసిన బోర్లకు మిషన్ భగీరథ ఏఈ బిల్లులు చేయడం లేదని బిల్లులు ఇప్పించి ఇబ్బందులు తొలగించాలని మొట్లపల్లి ఎంపీటీసీ బోల్లమల్ల కౌసల్య సభ దృష్టికి తీసుకొచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎస్సారెస్పీ కాలువలపై నాటిన మొక్కలు సంబంధిత అధికారులు తొలగిస్తున్నారని ఈ విషయమై అధికారులు చొరవ తీసుకోవాలని సభ్యులు కోరారు. కొన్ని జిల్లాల్లో రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నారని పెద్దపల్లి జిల్లాకు పంపిణీ చేయడంలేదని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంలేదని సభ్యులు ఆరోపించారు. అటవీశాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, ఎస్సారెస్పీ, ఉద్యావనశాఖల అధికారులు సభకు హాజరుకాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం..

హరితహారం, ఈజీఎస్, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, తడి, పొడి చెత్త నిర్వహణ వంటి కార్యక్రమాల విజయవంతం ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే సాధ్యమైందని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో రామ్మోహనా చారి, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ పోలు సురేశ్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ అభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీకి బీఆర్‌ఎస్ నాయకుల వత్తాసు

- మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



తేమశాతం పరిశీలిస్తున్న విజయరమణారావు

జూలపల్లి: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి బీఆర్‌ఎస్ నాయకులు వత్తాసు పలకడం సిగ్గుచేటని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణరావు ఆరోపించారు. మండలకేంద్రంతో పాటు, పెద్దాపూర్, వడ్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమశాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు 6కిలోల తరుగు తీస్తూ దోపిడీకి పాల్పడినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రైతులను పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు లేక రైతులు పడిగాపులు కాస్తున్నా, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పెద్దాపూర్‌లో నాయకులు చెరుకు నర్సయ్య, దొమ్మాటి మొండయ్య, పల్లాటి రవి, బొజ్జ శ్రీనివాస్, కొంపెల్లి స్వామి, జూలపల్లిలో కాంతయ్య, మంద లక్ష్మన్, కొమ్మ పోచాలు, బండి స్వామి, ఐల రాజయ్య, గడ్డం మల్లారెడ్డి, కొమురయ్య, వడ్కాపూర్‌లో మాంకాలి అంజయ్య, కోరెపు సంపత్, వేల్పుల లింగయ్య, కనుకుట్ల నర్సింగం ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్‌లోని ఎంపీపీ చాంబర్‌లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్‌అలీ పాల్గొన్నారు. అలాగే మండలంలోని దేవునిపల్లిలో గ్రామసభను సర్పంచ్ కోమలత అధ్యక్షతన నిర్వహించగా పాల్గొన్న ఎంపీపీ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బెల్లి లలితక్కకు కొవ్వొత్తులతో నివాళి



నివాళి అర్పిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలి వద్ద శుక్రవారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారిణి, గాయని బెల్లి లలితక్కకు శుక్రవారం నివాళి అర్పించారు. నాయకులు వెంకటేశ్, దుర్గయ్య, గోపాల్, అనిల్, రియాజ్, అరుణ, రవికుమార్, కొమురయ్య, ప్రశాంత్, అజీం పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా ధ్వజారోహణ పూజ



హోమం నిర్వహిస్తున్న శ్రీనంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మండలం యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీసజీవ్ నంబూద్రి గురుస్వామి వారి బృందంతో కేరళ వాయిద్యాలతో హోమాలు, ధ్వజారోహణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీరన్న పట్నాలు ప్రారంభం



పట్నాల్లో భక్తులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలోని కుర్మ, యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం బీరన్న పట్నాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీరప్ప మహంకాళి అమ్మవారికి పాలు నెయ్యి, అభిషేకం వంటి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

చిత్ర కథ: ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



జ్యోతినగర్: నిత్యం ప్రజలు, వాహనదారులతో రద్దీగా ఉండే ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. రోడ్డు వెడల్పులో భాగంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. డివైడర్ లేకపోవడంతో విద్యుత్ స్తంభానికి వాహనం ఢీకొనడంతో స్తంభం సగం పక్కకు ఒరిగింది. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.